ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

- ముందుకు సాగని ఆర్వోబీ పనులు
- తాత్సారం చేస్తున్న రైల్వే అధికారులు

ఉంగుటూరు: రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఒక అడుగు ముందుకు వేస్తే రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. పనులు ముందుకు వెళ్లడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. సుమారు ఏడాది క్రితం ఈ బ్రిడ్జి నిర్మాణ తాలుకా పనులు ప్రారంభించారు. సర్వే చేయడం, భూ సేకరణకు సంబంధించిన పనులు వంటివి కాస్త ముందుకు వెళ్లాయి. బ్రిడ్జిలు స్పష్టంగా ఎక్కడి నుంచి వెళతాయనే విషయంలో స్పష్టత రాలేదు. గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. అయితే ప్రజలు కొన్ని బ్రిడ్జిలకు ఇలా కాదు.. అలా అయితే బాగుంటుందని అనడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ఉంగుటూరు ఆర్వోబీ విషయంలో మూడు ప్రతిపాదనలు తయారు చేసుకున్నారు. టాటా సెల్ టవర్ వద్ద నుంచి వెళ్లేలా ఒకటి ఫైనల్ అవుతుందని అనుకున్నారు. సెంటర్ నుంచి ఒక ప్రతిపాదన, నారాయణపురం వైపు నుంచి ఇంకో ప్రతిపాదన రైల్వే శాఖ దగ్గర ఉన్నాయి. ఈ మూడిండిలో క్లారిటీ ఇంకా రాలేదు. చేబ్రోలు ఆర్వోబీ విషయంలో అలాగే ఉంది. కై కరంలో అంతా అయిపోయింది. ఇంకా పనులు మొదలు పెట్టడమే తరువాయి అనుకున్న తరుణంలో స్థలాలు కోల్పోతున్న వారు అభ్యంతరం చెప్పారు.



కైకరంలో ఆర్వోబీ నిర్మించే ప్రాంతం



కైకరంలో ఆర్వోబీ నిర్మాణానికి సర్వే రాళ్లు పాతిన రైల్వే అధికారులు

ప్లాన్ మార్చడంతో తాత్సారం

ఇప్పుడున్న రోడ్డు మీద నుంచి ఎలైన్‌మెంట్ వెళితే ఎక్కువ స్థలం కోల్పోవాల్సిన అవసరం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో ఆ విషయం పరిశీలిస్తున్నారు. ఈ కారణంతో మళ్లీ బ్రేక్ పడింది. నాచుగుంటలో అండర్ పాస్ బ్రిడ్జినా లేక ఫ్లై ఓవరా అన్న విషయం తేలలేదు. వెల్లమిల్లిలో కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. బాదంపూడి ఫ్లై ఓవరు బ్రిడ్జి ఊరి బయట అండర్‌పాస్‌ని ప్రజలు కొందరు అడుగుతున్నారు. దీంతో ఆర్వోబీ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కై కరం ఆర్వోబీ చూసేవారు విజయవాడ విభాగానికి చెందిన వారు అయితే మిగిలిన చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడి, నాచుగుంట, వెల్లమిల్లి చూసేది రాజమండ్రి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఫలితంగా సమన్వయం కొరవడింది. రైల్వే శాఖ, రెవెన్యూ, జాతీయ రహదారుల అధికారులు కలవడం, సమన్వయం అవడం కావాల్సి ఉండడంతో జాప్యానికి మరో కారణం కూడా అవుతోంది. ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కృషి చేసి ఆర్వోబీలు మంజూరు చేయించారు. అలాగే రైల్వే శాఖ కూడా గేటు లేని లెవెల్ క్రాసింగులు చేయాలనే తలంపుతో ఉండటం కూడా కారణంగా కనిపిస్తుంది.



ఉంగుటూరులో ఆర్వోబీ నిర్మించే ప్రదేశం

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భీమడోలు: విద్యార్థి దశ నుంచి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఆమెన్ ట్రస్ట్ డైరెక్టర్ ఇవాంజలి అన్నారు. పూళ్ల బాలికల వసతి గృహంలో మంగళవారం ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత లోపిస్తే కలిగే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ట్రస్ట్ డైరెక్టర్ ఇవాంజలి మాట్లాడుతూ కౌమార దశలోని బాలికలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతులుగా ఉండి చదువులో రాణిస్తారన్నారు. వార్డెన్ సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వం బాలికలకు అందిస్తున్న బలవర్ధక ఆహారాన్ని తీసుకోవడం ద్వారా వ్యాధులు దూరంగా ఉంటారన్నారు. అనంతరం ట్రస్ట్ ఆర్థిక సాయంతో 100 మందికి వ్యక్తిగత పరిశుభ్రత కలిగించే కిట్లను ఉచితంగా అందజేశారు. పదో తరగతి బాలికలకు పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు.



పరీక్ష ప్యాడ్‌లను అందుకున్న బాలికలు

నకిలీ మద్యంపై ప్రజాగ్రహ నిరసన విజయవంతం

భీమడోలు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన నకిలీ మద్యంపై జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రజాగ్రహ నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాస్ మంగళవారం అన్నారు. కూటమి పాలనలో కుటీర పరిశ్రమల మాదిరిగా నకిలీ మద్యం ఏరులై పారుతుందన్నారు. ఆ మద్యాన్ని తాగిన పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా, నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను గొంతెత్తి చాటారన్నారు. నారా వారి పాలన అంతా నకిలీ మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించకుండా తాత్సారం చేస్తూ సూత్రధారులను తప్పించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. నకిలీ మద్యంపై నిజాలు నిగ్గుతేల్చడానికి ప్రభుత్వం సీబీఐతో విచారణ చేయించి, తన నిజాయితీ నిరూపించుకుని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నకిలీ మద్యం కేసును నీరు కార్చేందుకు సిట్‌ను ఏర్పాటు చేసిందని, దీని వలన అసలైన దోషులు తప్పించుకుని, అమాయకులను బలి చేస్తారన్నారు. నకిలీ మద్యం విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారన్నారు.



ఆళ్ల శ్రీనివాస్

రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: రక్తదాతలు ప్రాణదాతలని వేగవరం హేలాపురి ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ సైన్స్ కళాశాల సెక్రటరీ అట్లూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిపూర్ణ ఆరోగ్యం ముఖ్యం

దెందులూరు: విద్యార్థుల్లో మానసికంగా శారీరకంగా పరిపూర్ణ ఆరోగ్యం ముఖ్యమని హెల్త్ అవేర్‌నెస్ మోడల్ ఆఫీసర్ సైక్రియాటిస్ట్ కోమలి అన్నారు. మంగళవారం బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఒక్కరు ముఖ్యంగా విద్యార్థులు ఒత్తిళ్లకు లోను కాకుండా క్రమం తప్పకుండా వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం సరిపడా నిద్ర తప్పక పాటించాలన్నారు. సాంప్రదాయేతర ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు ఇష్టంతో ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

జీఎస్టీ ఫలితాలు ప్రజలకు అందాలి

గణపవరం: జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రజలకు అందాలని అప్పటి వరకూ అవగాహన కల్పించాలని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం గణపవరంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, అఖిల పక్షనాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో గొర్రెల బాలయ్య, సురేంద్ర, శ్రీనివాసరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు. తొలుత భక్తులు అభయాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతర అన్నసమారాధనలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ తారకేశ్వరరావు, చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రుల ఒళ్లు హూనం..



గుంతల మయంగా మారిన రహదారి



గుంతల్లో వర్షం నీటితో నిండిన రహదారి

- అధ్వానంగా ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రహదారి
- అవస్థలు పడుతున్న గిరిజనులు

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారడంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం కురిస్తే నీరు నిలిచిపోతోంది. రోడ్డుపై రాళ్లు పైకి లేచి వాహనాలు జారిపడిపోతున్నాయని, వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో గుంతల్లో వాహనాలు జారిపడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని చెబుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు రాత్రి సమయాల్లో తిరగాలంటేనే భయంగా ఉందని, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, వాహనదారులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి, రోడ్డు గుంతలతో నిండిపోయినా కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ పెరిగిపోయి ఎదురొచ్చే వాహనాలు కూడా కానరాని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, నాయకులు కూడా ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు 11 కిలోమీటర్ల పొడవునా ఇటికిలకోట, బోడిగూడెం, వింజరం, గుంజవరం, సింగన్నపల్లి, మామిడిగొంది, చేగొండిపల్లి గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా నిత్యం ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా తిరగడం ఇబ్బందిగా మారింది. 2022లో అప్పటి ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే రోడ్డు నిర్మాణం జాప్యం జరగడంతో పూర్తి కాలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డు పరిస్థితిని పరిశీలించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

కనీస మరమ్మతులు లేవు



కార్మెల్‌పురం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకు వెళ్లే రోడ్డు మార్గం గుంతలు పడి అధ్వానంగా మారింది. కనీస మరమ్మతులు కూడా నోచుకోలేదు. వర్షం కురిస్తే ప్రధాన రోడ్డు మార్గం మొత్తం గుంతల్లో వర్షం నీరు నిలిచిపోయి వాహనాలు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కనీసం గుంతలు కూడా పూడ్చని పరిస్థితి ఏర్పడింది.

-కె.నాగరాజు, ఆటో డ్రైవర్

టీబీ రహిత సమాజాన్ని నిర్మించాలి

గణపవరం: టీబీ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ ధీరజ్ అన్నారు. మంగళవారం ఆయన గణపవరం పీహెచ్‌సీని సందర్శించారు. టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంపై ఆయన సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమం అమలు తీరు, రోగుల గుర్తింపు, చికిత్సా విధానం, మందుల సరఫరా, తదితర అంశాలపై సమీక్షించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. టీబీ నివారణ కార్యక్రమాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీబీ జిల్లా మానిటరింగ్ అధికారి సీహెచ్ ధనలక్ష్మి, సీహెచ్‌వో జాలాది విల్సన్, టీబీ సూపర్‌వైజర్ శ్రావణ్, ధనుంజయ్, బాలామురళి తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి ధీరజ్

గుబ్బల మంగమ్మ గుడి పరిసరాల్లో ప్లాస్టిక్ నిషేధం

బుట్టాయగూడెం: గిరిజనుల ఆరాధ్య దైవంగా పూజించబడుతున్న గుబ్బల మంగమ్మతల్లి గుడి పరిసర ప్రాంతాలపై ఆలయ కమిటీ వారు ప్రత్యేక దృష్టి పెట్టారు. దీనిలో భాగంగా 10 మంది కూలీలతో ప్రతి రోజూ ఆలయ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాస్‌లు, కవర్లను శుభ్రం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత అక్కడే సహపంక్తి భోజనాలు చేస్తుంటారు. అనంతరం వారు తిన్న ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, రకరకాల ప్లాస్టిక్ కవర్లు అక్కడే వదిలేస్తుంటారు. దీని వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున కమిటీ ప్రత్యేక కృషితో కూలీలను ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు కూడా ప్లాస్టిక్ నిషేదంపై ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

ఉంగుటూరు: ఉండి–నారాయణపురం ఆర్‌అండ్‌బీ రహదారికి ఏలూరు కాలువపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన శిథిలమై రంధ్రం పడిన విషయం తెల్సిందే. ఈ క్రమంలో తుది దశకు చేరిన నారాయణపురం వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలను చేశారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ట్రాఫిక్ సమస్య

ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు చూసి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాక ముందే ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరిగేందుకు అనుమతి ఇచ్చారు. సోమవారం నుంచి తిరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం సాయంత్రమే ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తప్పకోవడానికి వీలు లేని విధంగా పరిస్థితి తయారైంది.

పెరుగుతున్న వరద ఉధృతి

దెందులూరు: దెందులూరు–అలుగులగూడెం మధ్య నిర్మించిన సైఫన్‌పై వరద ఉధృతి క్రమేపీ పెరుగుతుంది. పై ప్రాంతాల నుంచి వర్షపు నీరు దెందులూరు సైఫన్ మీదుగా దిగువ ప్రాంతాలకు వెళుతోంది. సైఫన్ మీదుగా ప్రతిరోజూ నాలుగు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.

క్లుప్తంగా

నాగమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల కోలాహలం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఉంగుటూరు: కైకరం నాగమ్మతల్లి ఆలయం వద్ద నలుగురు గుమికూడవద్దు అనే ఆంక్షలు ఉన్నా భక్తుల మనోభావాలను ఎవరూ అడ్డుకోలేరు. మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో నాగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రధానంగా మహిళలు పూజలు చేశారు. అయితే ఆలయ పూజారి, రెవెన్యూ శాఖ ఉద్యోగులు ధర్శించుకున్న తరువాత భక్తులు ఇక్కడ ఉండొద్దని చెప్పి పంపించేశారు. అయితే ఉత్సవ కమిటీ సభ్యులు మాత్రం అన్నదానం కార్యక్రమానికి విఘాతం కలగకూడదని ఆలయానికి దూరంగా తొలుత వెలిసిన వేపచెట్టు వద్ద అన్నదానం నిర్వహించారు. ఆలయం వద్ద జనం గుమికూడకుండా తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు. పోలీసులు కూడా తిరిగారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దెందులూరు: సార్వా పంట 2025 సంవత్సరానికి సంబంధించి ధాన్యం కొనుగోలుకు వ్యవసాయ శాఖ సహాయకులు వీఆర్‌ఓలు సిద్ధం కావాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, ఏవోఎల్.శ్రీనివాసరాజు అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి శిక్షణలో అంశాలను అవగాహన చేసుకొని కేంద్రాల నిర్వహణ విజయవంతం చేయాలని సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వ్యవసాయ శాఖ సహాయకులు వీఆర్‌ఓలకు శిక్షణ సమావేశం నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు ధాన్యం కొనుగోలు నిబంధనలు, గోనె సంచుల పంపిణీ రికార్డుల నిర్వహణ, శాఖాపరమైన అంశాల నిర్ధారణపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండలంలోని వీఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



స్వామివారి కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీసీతారామస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రీతికరమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో అభిషేకాలు, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సాయి సుధీరాచార్యుల ఆధ్వర్యంలో పాలాభిషేక, తదితర పూజలను నిర్వహించారు. తొలుత స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో రంగోలి పోటీలు



రంగ వల్లులు వేస్తున్న విద్యార్థినులు

గణపవరం: విద్యార్థులలో పోటీతత్వం అలవడటానికి పలు రకాల పోటీలు దోహదం చేస్తాయని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం డిగ్రీ కాలేజీలో దీక్షారంబ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రన్నింగ్, రంగోలి, మెహందీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు రంగవల్లికల పోటీలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ గణేష్‌కుమార్, సిప్ కో–ఆర్డినేటర్ జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని మందుగుండు సామగ్రిపై చర్యలు

ఉంగుటూరు: అనుమతి లేని మందుగుండు సామగ్రి తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. ఫైర్ సేఫ్టీ నియమాలు పాటించాలని అన్నారు. అనుమతి లేని చోట నిల్వ చేసినా, ఇరుకు ప్రదేశాల్లో ఉంచినా చర్యలు తప్పవని అన్నారు. విక్రయదారులకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. మైనర్లను ఈ పనులకు ఉపయోగించకూడదని ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షల పరిశీలన



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ నర్సింహమూర్తి

పెదపాడు: మండలంలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఏ-1 పరీక్షలను ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి మంగళవారం పరిశీలించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహణను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల పరీక్ష పేపర్లను పరిశీలించారు. పేపరు రాసే విధానం వారికి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదకడిమిలో వ్యవసాయ విద్యార్థుల సందడి



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ విద్యార్థులు

పెదవేగి: మండలంలోని పెదకడిమి గ్రామంలో రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెదకడిమి గ్రామ విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, భూసార స్థితిగతులపై మంగళవారం గ్రామీణ రైతు భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్, శాస్త్రవేత్త కె.ఫణికుమార్, పెదవేగి మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాస్ రైతులతో సంయుక్తంగా మాట్లాడుతూ పంట కాలాలు, దిగుబడులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ప్రశాంతి, షర్మిల, మేఘన, వందన, ప్రశాంతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో ఎరువుల తనిఖీ



ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిశీలనలో భాగంగా మంగళవారం దెందులూరు కో–ఆపరేటివ్ సొసైటీలో ఎరువులను తనిఖీ చేశామని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ఎరువుల నిల్వలను పరిశీలించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పడకేసిన పంచాయతీ పాలన



కైకరం పంచాయతీ కార్యాలయం

ఉంగుటూరు: కైకరం పంచాయతీలో పాలన పడకేసింది. దీంతో గ్రామంలో పారిశుద్ధ్యంతో పాటు అన్ని పనులు నిలిచిపోయాయి. ముందు చేసిన పనులకు సుమారు రూ.7 లక్షల చెల్లింపులు ఆగిపోయాయి. పంచాయతీ సర్పంచిపై ఆరోపణలు రావడంతో సర్పంచి, కార్యదర్శితో పాటు, మూడో కౌంటర్ సంతకం ఈవోపీఆర్డీకి ఇచ్చారు. దీంతో ఆయన వేసిన కొర్రీ వలన బిల్లుల చెల్లింపులు జరగలేదు. పంచాయతీ పాలకవర్గం తీర్మా నం చేసినా బిల్లులు విడుదల చేయలేదు. వీధి లైట్లు, పారిశుధ్యం, మోటార్లు కాలిపోయినా కొత్తవి వేయడం, తదితర కనీస అవసరాలు కూడా చేయడం లేదు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

జంగారెడ్డిగూడెం: తిరుమలపురం జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ సమకూరింది. పాఠశాల ఆన్‌లైన్ పనులకు కంప్యూటర్ అవసరాన్ని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సంయుక్తంగా జంగారెడ్డిగూడెం ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్‌కు తెలియజేయడంతో ఆయన స్పందించారు. మంగళవారం ఎస్‌బీఐ టౌన్‌బ్రాంచ్ మేనేజర్ పి.రమా సతీష్ కుమార్ రూ.30 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాలకు బహూకరించారు. ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ ఫీల్డ్ అధికారి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.